ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- నేడు, రేపు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం
- 20 నుంచి 23వరకు తేలికపాటి వర్షాలు కురవచ్చు
- నారాయణపేట కలెక్టర్ శ్రీహర్ష

నారాయణపేట, ఏప్రిల్ 17: వారం రోజులపాటు ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నారాయణపేట కలెక్టర్ శ్రీహర్ష బుధవారం ప్రకటనలో సూచించారు. జిల్లాలో పొడి వాతావరణం ఉంటూ రాబోయే రెండు రోజులు 2 నుంచి 3 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఈనెల 20 నుంచి 23 వరకు జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉన్నదన్నారు. హీట్ వేవ్ రిస్క్ ఎల్లో అలర్ట్‌గా వర్గీకరించబడిందని, దీనివల్ల ఉష్ణోగ్రత మితంగా ఉంటుందని తెలిపారు. వేడిగాలుల వల్ల చిన్నారులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఎదుర్కోకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. తక్కువ బరువు, లేత రంగు, వదులుగా ఉన్న కాటన్ దుస్తులను ధరించాలన్నారు. గుడ్డ, టోపీ లేదా గొడుగుతో తలను కప్పుకోవాలని సూచించారు.

తగినంత నీరు తీసుకోవాలని, ఓఆర్ఎస్, మజ్జిగ, నిమ్మ రసం, లస్సీ వంటివి ఇండ్లలో తయారు చేసుకొని తాగాలన్నారు. వర్షాలు కురిసే అవకాశం ఉ న్నందున ధాన్యం తడిసిపోకుండా టార్పాలిన్‌లను ఉపయోగించాలని రైతులకు సూచించారు.

ఎవరికీ భయపడొద్దు..

- ప్రశాంత వాతావరణంలో ఓటు వేయాలి
- మక్తల్ ఎస్సై ఆచారి

భూత్పూర్‌లో పోలీస్ కవాతు నిర్వహిస్తున్న బలగాలు

మక్తల్ టౌన్, ఏప్రిల్ 17 : పార్లమెంట్ ఎన్నికల్లో ఎవరికీ భయపడకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఓటుహక్కును వినియోగించుకోవాలని ప్రజలకు ధైర్యాన్నిస్తూ పోలీస్ కవాతు నిర్వహించినట్లు మక్తల్ పట్టణ రెండో ఎస్సై ఆచారి అన్నారు. ఎస్పీ యోగేశ్ గౌతమ్ ఆదేశాల మేరకు మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన భూత్పూర్, రుద్రసముద్రంలో బుధవారం పోలీసు, కేంద్ర సాయుధ పోలీసు బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పోలీసు, కేంద్ర సాయుధ బలగాలు పాల్గొన్నారు.

రూ.2.15లక్షలు సీజ్

రాజాపూర్‌లో నగదును సీజ్ చేసిన పోలీసులు

రాజాపూర్, ఏప్రిల్ 17 : రసీదు లేకుండా తరలిస్తున్న నగదును స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఎస్సై రవి తెలిపారు. మండల కేంద్ర పరిధిలోని రంగారెడ్డిగూడ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆత్మకూర్‌కు చెందిన అహ్మద్‌బాషా, భిక్షపతి, సహదేవనాయుడు మూడు వాహనాల్లో తరలిస్తున్న రూ.2.15లక్షలను చెక్‌పోస్టు వద్ద స్వాధీనం చేసుకున్నారు. అందుకు సంబంధించి ఎలాంటి రసీదులు చూపకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్సై వెల్లడించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

నవాబ్‌పేట, ఏప్రిల్ 17 : మండలంలోని ఫత్తేపూర్ గేట్ వద్ద బుధవారం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై అభిషేక్‌రెడ్డి తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. జడ్చర్ల మండలం ఖానాపూర్‌కు చెందిన బొజ్జ రాజేందర్ తన సొంత టిప్పర్‌లో ఉదండాపూర్ రిజర్వాయర్‌లో అక్రమంగా ఫిల్టర్ ఇసుకను నింపుకొని ఫత్తేపూర్‌కు వెళ్తున్నాడు. పక్కా సమాచారంతో నిఘా ఉంచి, అతడిని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

హెచ్చరిక

నా క్లైంట్, యం.సాయిదాస్ తండ్రి కీ॥శే॥ వెంకటయ్య, వృత్తి : విశ్రాంత ఉపాధ్యాయులు, నివాసము : ఇం.నం.10-164/1, శాంతినగర్ కాలని, మహబూబ్‌నగర్ అను వారు ఇచ్చిన సమాచారము మేరకు యావన్మందికి తెలియచేయునది ఏమనగా, బాకీ ఇచ్చిన డబ్బులు రాబట్టుటకై జిల్లా కోర్టు, మహబూబ్‌నగర్ గారి ముందు దావా వేసి, పోచమ్మ కాలనిలో ఉన్న గృహమును అమ్ముటకై వీలుకాని (అటాచ్‌మెంట్) ఆర్డరు పొందియున్నారు. ఇట్టి విషయము దాచిపెట్టి కె.వి.నారాయణ ఆయన భార్య అనుసూయ, నివాసము రాంకీకొంటి, తుక్కుగూడ అనువారు సదరు ఇల్లును అమ్ముటకై ప్రయత్నించుచున్నట్లుగా తెలియవచ్చినది. ఇది పూర్తిగా చట్ట విరుద్ధము. కనుక పోచమ్మ కాలనిలో నిర్మించిన ఇల్లును కె.వి.నారాయణ, అనుసూయల దగ్గర ఏలాంటి కొనుగోలు చేయకూడదని, అతిక్రమించిన వారు కోర్టు ఉత్తర్వుల ద్వారా నా క్లైంటు తీసుకొనే తదుపరి చర్యలకు పూర్తి బాధ్యులవుతారని, ఈ ప్రకటన ద్వారా హెచ్చరించుచున్నాము.
తేది: 17-04-2024
స్థలం :మహబూబ్‌నగర్
నీలినరసప్ప, న్యాయవాది
పరిమళగిరి, న్యూప్రేమ్‌నగర్, మహబూబ్‌నగర్

కుక్కలదాడిలో నెమలి మృతి

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, ఏప్రిల్ 17 : నెమలిపై కుక్కలు దాడి చేయగా మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకున్నది. ఆటవీశాఖ బీట్ అధికారి అనిత కథనం మేరకు.. మున్సిపాలిటీ పరిధిలోని ఎదిర రెవెన్యూ వార్డులో బుధవారం ఉదయం ఓ నెమలి సంచరిస్తుండగా అక్కడున్న కుక్కలు దాడి చేసి గొంతు పట్టాయి. గమనించిన స్థానికులు నెమలిని కాపాడి అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. అధికారి అనిత ఘటనా స్థలానికి వెళ్లే సరికి నెమలి మృతి చెందింది. ఈ మేరకు పోస్టుమార్టం నిమిత్తం నెమలిని తరలించినట్లు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED
★KFC Hiring P/F Time Jobs in Hyd. SSC Pass, 18 yrs Abv. M&F. 13k with Food & Accom. PF/ Medical/ Bonus/ Incentive. Ph: 9392526486, 9704449461, 8688442326.
NT-136-All

WANTED
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K Ph: 9640258899/9640468899
NT-311829

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

చెరువు మట్టి.. చేనుకు పుష్టి

- ఉపాధి హామీలో భాగంగా ఒండ్రుమట్టి తరలింపు పనులు
- పొలాల్లో వేసుకునేందుకు ఆసక్తి చూపుతున్న రైతులు
- సారవంతం కానున్న చౌడు, ఇసుక, రాతినేలలు

ఊట్కూర్, ఏప్రిల్ 17 : పంట చేలల్లో భూసారాన్ని పెంచేందుకు భూముల్లో నల్ల మట్టి(ఒండ్రు మట్టి) వేసుకోవడం ద్వారా ఎంతో మేలు చేస్తుందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. దీంతో మండలంలోని పలు గ్రామాల్లో రైతులు ఉపాధి హామీ పథకం ద్వారా తమ పొలాల్లో ఒండ్రు మట్టిని వేసుకునేందుకు ఆసక్తిని చూపిస్తున్నారు. నల్లరేగడి నేలల్లోనే కాకుండా చౌడు, ఇసుక, రాతి నేలల్లో నల్ల మట్టి వేస్తే భూసారం మరింత పెరిగి రైతుకు పంట దిగుబడి సైతం పెరుగుతుంది. ప్రస్తుతం మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులు ఇది వరకు సాగు చేసిన పత్తి, జొన్న పంటలు పూర్తి కావడంతో తిరిగి వానకాలం పంట సాగుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. ఈ తరుణంలో ఉపాధి హామీ పథకం ద్వారా చెరువు మట్టిని పంట చేలకు పెద్ద ఎత్తున తరలిస్తున్నారు.

ఉపాధి హామీ పథకం ద్వారా..

గ్రామాల్లో అందరికీ పని కల్పించాలని, వలసలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ప్రవేశ పెట్టింది. ఈ పథకం కింద రైతులు చెరువులోని ఒండ్రుమట్టిని ట్రాక్టర్ల ద్వారా చేన్లకు తరలిస్తున్నారు. అధిక దిగుబడి సాధించడానికి పూడిక మట్టి ఎంతగానో ఉపయోగపడుతుంది. నల్లమట్టిలో అధిక పోషక గుణాలు ఉంటాయి. భూమి సారవంతం అవుతుండడంతో రైతులు తమ పొలాల్లో ఒండ్రుమట్టి వేసుకునేందుకు అసక్తి చూపుతున్నారు.

అధిక పోషక గుణాలు

నల్లమట్టితో భూమి సారవంతమై పోషక గుణాలు అందుతాయి. నత్రజని, భాస్వరం, పొటాష్ తదితర గుణాలు అధికంగా ఉంటాయి. దీంతో పంట దిగుబడి అధికంగా వస్తుంది. ఇసుక నేలల్లో చెరువు మట్టిని వేసుకుంటే నీటి నిల్వ సామర్థ్యం పెరిగి భూమి సారవంతం అవుతుంది. వేసవికి ముందే నల్ల మట్టి వేసి భూమిలో కలిసి పోయేలా దున్నితే భూసారం మరింత పెరగడంతోపాటు పంటలకు కావలసిన పోషకాలు అందుతాయి.

పంట చేన్లల్లో వేసుకున్న ఒండ్రుమట్టి

నిబంధనల ప్రకారం పూడికతీత..

ఉపాధి హామీ పథకంలో భాగంగా ఊట్కూర్, నిడుగుర్తి, మొగ్దుంపూర్ తదితర గ్రామాల్లో చెరువుల్లో మట్టి పూడికతీత పనులు నిబంధనల ప్రకారం సాగుతున్నాయి. కూలీలు తవ్విన మట్టిని ట్రాక్టర్ల ద్వారా రైతులు తమ పొలాలకు తరలిస్తున్నారు. ఉపాధి కూలీలకు పొలం పనులు లేకపోవడంతో పెద్ద ఎత్తున చెరువు పూడికతీత పనులకు వస్తున్నారు. రైతులు, భూమి యజమానులు ఈ పనులను సద్వినియోగం చేసుకుంటున్నారు.

భూమి సారవంతం..

చెరువులోని ఒండ్రు మట్టిని వేసుకోవడంతో భూమి సారవంతం అవుతుంది. ఉపాధి పనుల్లో భాగంగా చెరువు మట్టిని చేన్లలో వేసుకుంటున్నాం. చెరువు పూడిక తీయడంతో జలాలు పెరిగే అవకాశం కూడా ఉంది. పంట దిగుబడులు అధికంగా వస్తాయి.

– వీరేశ్‌గౌడ్, రైతు, ఊట్కూర్

ఇదే మంచి సమయం..

చెరువులో పూడిక మట్టిని తరలించేందుకు రైతులకు ఇదే మంచి సమయం. ప్రస్తుతం ఉపాధి హామీ కూలీలు మట్టిని నింపుతున్నారు. పూడిక మట్టిని వేస్తే భూమి సారవంతమవుతుంది. తద్వారా రైతులు మంచి దిగుబడులు పొందవచ్చు. పంట పెట్టుబడి ఖర్చు కూడా తగ్గుతుంది.

– గణేశ్‌రెడ్డి, ఏవో, ఊట్కూర్

గర్భిణి మృతి

- పేట జిల్లా దవాఖాన ఎదుట బంధువుల ఆందోళన
- గుండెపోటుతోనే మృతి చెందిందంటున్న వైద్యులు

పేట జిల్లా దవాఖాన ఎదుట ధర్నా చేస్తున్న బంధువులు

నారాయణ పేట, ఏప్రిల్ 17 : ప్రసవ సమయంలో గర్భిణి మృతి చెందిన ఘటన నారాయణపేట జిల్లా దవాఖానలో చోటు చేసుకున్నది. ఇందుకు సంబంధించిన వివరాలిలా.. మద్దూరు మండలం భీంపురం గ్రామానికి చెందిన గర్భిణి గోవిందమ్మ (36) ప్రసవం కోసం నారాయణపేట జిల్లా దవాఖానకు వచ్చింది. మొదటి రెండు కాన్పులు సాధారణం కావడంతో మూడో కాన్పు కూడా సాధారణంగానే అవుతుందని భావించి కుటుంబీకులు ముందుగా మద్దూరు ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ కాదనడంతో జిల్లా దవాఖానకు తరలించా రు. ప్రసవం చేస్తున్న క్రమంలో గర్భిణికి గుండెపోటు వచ్చిందని, తమ వంతు ప్రయత్నించినా లాభం లేకపోయిందని వైద్యులు చెబుతున్నారు. కాగా వైద్యుల నిర్లక్ష్యం వల్లనే గోవిందమ్మ మృతి చెందిందని ఆరోపిస్తూ ఆమె కుటుంబీకులు జిల్లా దవాఖాన ఎదుట ధర్నా చేపట్టారు. గ్రామ పెద్దలు కుటుంబస భ్యులతో మాట్లాడి నచ్చజెప్పి ఆందోళనను విరమింపజేసి తీసుకెళ్లారు.

రమణీయం.. రాములోరి కల్యాణం

మహబూబ్‌నగర్‌లోని రాంమందిర్ చౌరస్తా వద్ద సీతారాముల కల్యాణోత్సవానికి భారీగా తరలివచ్చిన మహిళలు, వ్యాపారులు, నాయకులు

పాలమూరులోని టీచర్స్ కాలనీ రామాలయంలో సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివారెడ్డి

మక్తల్‌లో స్వామివారికి బంగారు వడ్డానం తీసుకువస్తున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి

మహబూబ్‌నగర్, పేట జిల్లాల్లో బుధవారం శ్రీరామ నవమిని పురస్కరించుకొని సీతారాముల కల్యాణాన్ని వేదపండితులు అంగరంగ వైభవంగా నిర్వహించగా భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. పాలమూరులో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం, అనిరుధ్‌రెడ్డి, జీఎంఆర్, డీకే అరుణ, సీతారాములను దర్శించుకుని పూజలు చేశారు. ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి దంపతులు ముత్యాల తలంబ్రాలు సమర్పించగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి దంపతులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి 30 గ్రాముల బంగారు వడ్డానం, కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి దంపతులు ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. పలు చోట్ల యువకులు జై శ్రీరామ్ అంటూ బైక్ ర్యాలీలు, వీధుల్లో భజన చేస్తూ మేళతాళాలతో స్వామివారికి పల్లకీసేవ, డోలారోహణం, శోభాయాత్రను నిర్వహించారు. అలాగే ఆలయాల నిర్వాహకులు భక్తులకు అన్నదానం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

– నమస్తే నెట్‌వర్క్, ఏప్రిల్ 17

నచికేతన్ ఆశ్రమంలో సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న జిల్లా జడ్జి పాపిరెడ్డి

జడ్చర్ల మండలం గంగాపూర్ చెన్నకేశవస్వామి ఆలయం, కోడుగల్ నచికేతన్ ఆశ్రమాన్ని జిల్లా జడ్జి పాపిరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం దర్శించుకున్నారు. చెన్నకేశవస్వామి ఆలయంలో పూజల అనంతరం అనంతరం నచికేతన్ ఆశ్రమంలో శివలింగానికి పూజలు చేశారు.

– జడ్చర్ల టౌన్, ఏప్రిల్ 17

కేసీఆర్ ఎకో అర్బన్ పార్కులో విషాదం

- గుర్తు తెలియని యువతి కాలిన మృతదేహం లభ్యం
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, ఏప్రిల్ 17: కేసీఆర్ ఎకో అర్బన్ (మయూరి పార్కు)లో కాలిన గాయాలతో యువతి మృతదేహం ల భించింది. రూరల్ ఎస్సై విజయ్‌కుమార్ కథ నం మేరకు.. మహబూబ్‌నగర్ మున్సిపాలి టీ అప్పన్నపల్లి శివారులోని పార్కుకు బుధవారం ఉదయం గుర్తుతెలియని యువతి (22) వచ్చింది. 11:30 గంటల సమయం లో పార్కులోని గార్డెన్‌లో యువతికి మంట లు అంటుకోగా చుట్టుపక్కల వారు గమనిం చి పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి పెట్రోలింగ్ పోలీసులు చేరుకోగా అప్పటికే సదరు యువతి 80శాతం కాలిపోగా మంటలను పార్కు సిబ్బందితో కలిసి ఆర్పారు. ఘటనలో మృతురాలి మొ బైల్ పూర్తిగా కాలిపోయింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జనరల్ దవాఖానకు తరలించారు. కాగా మృతురా లి వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

అప్రమత్తతతో ప్రమాదాలను నివారించవచ్చు

- అగ్నిమాపకశాఖ జిల్లా అధికారి కిశోర్

అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, ఏప్రిల్ 17: అప్రమత్తతతో అగ్ని ప్రమాదాల ను నివారించవచ్చని అగ్నిమాపకశాఖ జిల్లా అధికారి కిశోర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని డాక్టర్ శామ్యూల్ హాస్పిటల్‌లో అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా అవగాహన కల్పించారు. మంటలు సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మంటలను ఎలాఆర్పాలో అగ్నిమాపక శాఖ అధికారులు డెమో రూపంలో వివరించారు. అగ్నిప్రమాదం జరిగినప్పుడు వెంటనే అగ్నిమాపక శాఖ 101 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. వేసవిలో అగ్నిప్రమాదాలు అధికంగా జరుగుతాయని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ ధర్మానాయక్, లీడింగ్ ఫైర్‌మేన్లు లక్ష్మణ్‌నాయక్, కృష్ణ, ఆపరేటర్ మురళీధర్‌రెడ్డి, ఫైర్ ఆఫీసర్లు శివప్రసాద్, కేశవులు, రాజేశ్, రవి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అక్రమ వెంచర్లను తొలగించాలి

ధన్వాడ, ఏప్రిల్ 17 : ధన్వాడ మండలంలోని కిష్టాపూర్, కొండాపూర్ గ్రామల్లో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన వెంచర్లను తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మండల నాయకుడు భీంరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా వెంచర్లను ఏర్పాటు చేసి ప్లాట్లను విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అక్రమ వెంచర్ల ద్వారా గ్రామం, ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి గండి పడుతుందన్నారు. కలెక్టర్ చొరవ తీసుకొని అక్రమ వెంచర్లను తొలగించాలని కోరారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన

కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వాణిశ్రీ

పాలమూరు, ఏప్రిల్ 17 : మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని రాంరెడ్డిగూడ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలలో బుధవారం మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి డా.సౌజన్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లో సానుకూల దృక్పథం, గోల్ సెట్టింగ్, కృతజ్ఞతా భావాన్ని ఎలా అలవర్చుకోవాలనే విషయాలను చక్కగా వివరించారు. అనంతరం ప్రిన్సిపాల్ వాణిశ్రీ, హెల్త్ సూపర్‌వైజర్ జయశ్రీ, ఆశ వర్కర్ విజయలక్ష్మి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దాడి చేయడం హేయమైన చర్య

అడ్డాకులలో మాట్లాడుతున్న మల్లెపోగు శ్రీనివాస్

మూసాపేట(అడ్డాకుల), ఏప్రిల్ 17: దళితులపై దాడి చేయడం హేయమైన చర్య అని ఎమ్మార్పీఎస్ టీఎస్ దక్షిణ తెలంగాణ అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ అన్నారు. బుధవారం అడ్డాకుల పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని బలీదుపల్లి ఎంపీటీసీ గణేశ్‌తో పాటు స్థానిక దళితులను కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, గణేశ్‌తో పాటు మరో ఇద్దరిపై చేసిన కౌంటర్ ఎఫ్ఐఆర్ కేసును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయనతో పాటు ఎంపీటీసీ గణేశ్, మాజీ ఎంపీపీ దయాకర్, కృష్ణ, వెంకటయ్య ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

బస్టాండ్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై మురళి

మరికల్, ఏప్రిల్ 17 : శ్రీరామ నవమిని పురస్కరించుకొని మరికల్ బస్టాండ్‌లో వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో బుధవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మరికల్ ఎస్సై మురళి, విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

ఏగూర్ దవాఖానాలో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జడ్చర్ల టౌన్, ఏప్రిల్ 17 : వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఏగూర్ ప్రైమ్ దవాఖానలో అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించారు. ఆసుపత్రుల్లో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఏంచేయాలనే విషయాలను డెమో రూపంలో వివరించారు. అగ్ని ప్రమాదాలను నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యులు, సిబ్బందికి వివరించారు. అనంతరం అగ్ని ప్రమాదాల నివారణ చర్యలను వివరిస్తూ ప్రచురించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి అధికారి శ్రీకాంత్‌రెడ్డి, సిబ్బంది వెంకటయ్య, నవీన్‌కుమార్, శ్రీనివాస్, గౌస్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం

భూత్పూర్,ఎప్రిల్17: పట్టణంలోని అమిస్తాపూర్‌లో బీజేపీ పార్లమెంట్ ఇన్‌చార్జి డోకూరు పవన్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటి ప్రచారం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైందని, రైతులకు ఇవ్వాల్సిన రైతుబంధు, రుణమాఫీ పథకాలను పూర్తిగా ఎత్తివేసి, కష్టాలపాలు చేసిందని విమర్శించారు. బీజేపీ అభ్యర్థి డీకే అరుణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు సత్తూర్ సత్యయ్యగౌడ్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఫారూఖ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాములు, మండల నాయకులు రాజ్‌గోపాల్‌రెడ్డి, గాల్‌రెడ్డి మల్లికార్జున్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్వేపల్లికి ఘన నివాళి

సర్వేపల్లి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

జడ్చర్ల టౌన్, ఏప్రిల్ 17 : మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ వర్ధంతిని జడ్చర్లలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు వక్తలు రాధాకృష్ణ జీవిత చరిత్ర, దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రజక ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జంగయ్య, సంస్కారభారతి సభ్యులు గోనెల రాధాకృష్ణ, యాదగిరి, వెంగళరావు, రమేశ్, శ్రీను, జయరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.